నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, ఆదివారం 22 జూన్ 2025 | MAHABUBABAD

## పోలీసుల హైడ్రామా..

కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్ట్ సందర్భంగా వరంగల్ పోలీసు కమిషనరేట్ నుంచి పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలు సుబేదారి పోలీస్‌స్టేషన్ ముందు మోహరించాయి. రోడ్లను బ్లాక్ చేసి పీఎస్ లోపలికి ఇతరులు ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు అడ్డు పెట్టి, భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డిని పరామర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. మీడియా ప్రతినిధులను సైతం లోపలికి అనుమతించలేదు. కాగా పోలీసుల ఓవర్‌యాక్షన్‌పై బీఆర్‌ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసి ఆందోళనకు దిగారు. పోలీసులు రోజంతా వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది.

**బీఆర్‌ఎస్ నేతల అడ్డగింతపై ఆందోళన**

కౌశిక్‌రెడ్డి అరెస్ట్ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్,


సుబేదారి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, రాకేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ లీగల్ సెల్ నాయకులు సహోదర్ రెడ్డి, పలువురు న్యాయవాదులు, హుజూరాబాద్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి నాయకులు పెద్ద సంఖ్యలో సుబేదారి పోలీసుస్టేషన్ తరలివచ్చారు. కౌశిక్‌రెడ్డిని పరామర్శించడానికి బీఆర్‌ఎస్ నేతలు స్టేషన్ లోపలికి వెళ్లే క్రమంలో పోలీసులు బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీఆర్‌ఎస్ శ్రేణులకు ఘర్షణ జరిగింది. చివరికి ముఖ్య నాయకులను లోపలికి వెళ్లడానికి అనుమతించారు. అనంతరం కుట్రపూరితంగా పెట్టిన నాన్ బెయిలబుల్ కేసులను రద్దు చేయాలని సీపీ సన్‌ప్రీత్‌సింగ్‌ను కలిసి కోరారు.


సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్‌వీ నాయకులు దహనం చేస్తుండగా లాకెళ్తున్న పోలీసులు

**నేతలు, కుటుంబ సభ్యుల పరామర్శ**

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయభాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, రాకేశ్‌రెడ్డి, పలువురు నాయకులు పోలీసుస్టేషన్‌లో అరెస్టైన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు. కౌశిక్‌రెడ్డి సతీమణి షాలిని, సోదరుడు, ఇతర కుటుంబ సభ్యులు పరామర్శించారు.


పోలీసులతో వాగ్వాదానికి దిగిన బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్


బెయిల్‌పై వచ్చిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ఎత్తుకున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు


నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు వీరేశం


సుబేదారి పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

## ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌పై భగ్గుమన్న బీఆర్‌ఎస్

# రోజంతా హైడ్రామా

- అర్ధరాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వద్ద నిర్బంధం
- ఉదయం సుబేదారి పీఎస్‌కు తరలించిన పోలీసులు
- పోలీసుస్టేషన్ వద్ద భారీగా మోహరించిన పోలీసు బలగాలు
- కౌశిక్‌రెడ్డికి మద్దతుగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన శ్రేణులు
- బీఆర్‌ఎస్ నేతలు, కుటుంబ సభ్యుల పరామర్శ
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం
- రాత్రి బెయిల్ మంజూరుతో సంబురాలు

## హైదరాబాద్‌లో తెల్లవారుజామున అరెస్ట్.. హనుమకొండలో రాత్రి బెయిల్

సుబేదారి, జూన్ 21 : బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్ట్ బీఆర్‌ఎస్ భగ్గుమంది. శనివారం తెల్లవారుజామున శంషాబాద్ విమానాశ్రయం వద్ద పోలీసుల నిర్బంధం మొదలు రాత్రి 8గంటల దాకా హైటెన్షన్ వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధకాండపై పార్టీ శ్రేణులు తీవ్రస్థాయిలో ఆందోళనలు చేపట్టడంతో సుబేదారి పోలీస్‌స్టేషన్ ప్రాంగణం అట్టుడికింది. అక్రమ అరెస్టులను నిరసిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిప్పులు చెరిగారు. కాంట్రాక్టర్ కట్టా మనోజ్‌రెడ్డి భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై ఏప్రిల్ 22న సుబేదారి పోలీసులు బీఎన్‌ఎస్ 308(2), 308(4), 352 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో భాగంగా శనివారం తెల్లవారుజామున హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కౌశిక్‌రెడ్డిని వరంగల్ పోలీసు కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్బంధించి, సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. మధ్యాహ్నం వరకు పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యేను నిర్బంధించారు. అదనంగా నాన్ బెయిలబుల్ సెక్షన్ 308(5) జత చేసి పక్కాప్లాన్‌తో మధ్యాహ్నం రెండు గంటల తర్వాత పోలీసు అధికారులు భారీ భద్రత మధ్య కౌశిక్‌రెడ్డిని వైద్య పరీక్షల కోసం ఎంజీఎంకు తీసుకెళ్లారు. ఆ తర్వాత కాజీపేట రైల్వే కోర్టులో మెజిస్ట్రేట్ సీహెచ్ సుస్మిత ముందు హాజరుపరచగా, జడ్జి బెయిల్ మంజూరు చేశారు. దీంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన న్యాయ మే గెలిచిందంటూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పటాకలు కాల్చుతూ సంబురాలు జరుపుకొన్నారు. బెయిల్ మంజూరైన తర్వాత కౌశిక్‌రెడ్డి కోర్టు నుంచి రావడంతోనే మాజీ మంత్రి దయాకర్‌రావు, మాజీ చీఫ్ వినయ్‌భాస్కర్ ఆలింగనం చేసుకొని హర్షం వ్యక్తం చేశారు.

కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ బీఆర్‌ఎస్ విద్యార్థి సంఘం నాయకులు సుబేదారి పోలీసుస్టేషన్ ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తూ, ప్రధాన ప్రతిపక్ష నేతలను అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓటుకు నోటు కేసు దొంగ రేవంత్‌రెడ్డి అని నినాదాలు చేశారు. ఈక్రమంలో విద్యార్థి నాయకులను పోలీసులు ఈడ్చుకెళ్లి వాహనాల్లో పడేయడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని వాహనాల్లో కాజీపేట, మడికొండ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అరెస్టైన వారిలో బీఆర్‌ఎస్వీ నాయకలు శరత్ చంద్ర,

### బీఆర్‌ఎస్వీ నాయకుల అరెస్ట్

వీరేందర్, సదంత్, రాంమూర్తి, చోటు, శ్రవణ్, రాజ్‌కుమార్, అరూరి రంజిత్, రాజ్‌గోపాల్ తదితరులు ఉన్నారు. కౌశిక్‌రెడ్డిని పోలీసు స్టేషన్ నుంచి ఎంజీఎంకు తీసుకువెళ్తున్న క్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్ జై తెలంగాణ నినాదాలు చేయడంతో ఓ ఎస్సై కాలర్‌పట్టి అత్యుత్సాహం ప్రదర్శించాడు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సీఎం రేవంత్‌రెడ్డికి జై తెలంగాణ నినాదం అంటే గిట్టదని, తెలంగాణ కోసం కొట్లాడినోడు కాదు కదా.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పోలీసులు కొమ్ము కాస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

### భయపడేది లేదు..

కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులపై పెట్టే తప్పుడు కేసులకు భయపడేది లేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలపై, ప్రజా సమస్యలపై పోరాడుతాం. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

*– చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు*


సుబేదారి పోలీస్‌స్టేషన్ వద్ద అడ్వకేట్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి భార్య షాలినీ

### న్యాయమే గెలిచింది

రేవంత్‌రెడ్డి తప్పులను ఎండగడుతున్న ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డిపై అక్రమ కేసు పెట్టారు. బెయిల్ రాకుండా చేయాలని సెక్షన్లు కూడా మార్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉండేది కొన్ని రోజులే. పోలీసులపై ఒత్తిడి ఉంది. కౌశిక్‌రెడ్డికి బెయిల్ కోసం గొప్పగా వాదించిన బీఆర్‌ఎస్ పార్టీ లీగల్ సెల్‌కు కృతజ్ఞతలు. కాంగ్రెస్ నేతలను తన్ని తరిమే రోజులు దగ్గరలోనే రానున్నాయి.

*– మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు*

### కుట్ర కేసు అని తేలిపోయింది

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పెట్టిన కేసు కుట్ర కేసు అని తేలిపోయింది. కౌశిక్‌రెడ్డిను రి మాండ్‌కు పంపిస్తున్నారని సోషల్‌మీడియాలో తప్పుడు కథనాలు ప్రసారం అయ్యాయి. మూడున్నర గంటల పాటు వాదనలు విన్న తర్వాత బెయిల్ మంజూరైంది. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా పార్టీ లీగల్ సెల్ ద్వారా ఎదుర్కొంటాం. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్సే.

*– ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్*

### ఇది ప్రజాపాలన కాదు.. పైశాచిక పాలన

హనుమకొండ చౌరస్తా : రాజకీయ కక్షసాధింపులో భాగంగానే పాడి కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, ఎప్పటికప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నందుకే అరెస్ట్ చేశారు. ఒక ఎమ్మెల్యే అని కూడా చూడకుండా కనీసం ములాఖాత్‌కు కూడా అవకాశం ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం హింసించాలని చూస్తున్నదని. ఇది ప్రజాపాలనలా లేదు, పైశాచిక పాలనలా ఉన్నది. అక్రమ మైనింగ్ చేస్తున్న దళారులను ప్రశ్నించి, ప్రజల కోసం నిలబడిన నాయకుడిపై అక్రమ కేసులు పెట్టడం దారుణం. అక్రమ కేసులతో విచారణ పేరుతో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను సైతం వేధిస్తున్నారు.

*– బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి*

### నాకు అండగా ఉన్న అందరికీ ధన్యవాదాలు

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నాపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు. ఏకే47 అవుతా. నాకు బెయిల్ మంజూరు కావడానికి కృషిచేసిన బీఆర్‌ఎస్ లీగల్ టీమ్‌కు చేతులు జోడించి నమస్కరిస్తున్నా. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తున్న బండారాన్ని రేపు హైదారాబాద్‌లో ప్రెస్‌మీట్ ద్వారా బయటపెడుతా. నాకు అండగా నిలిచిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వానికి, కార్యకర్తలకు పేరుపేరున ధన్యావాదాలు. *– ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి*


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, పక్కన మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం తదితరులు

### ఇది దుర్మార్గమైన చర్య



జనగామ, (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా కాంగ్రెస్ నియంతృత్వానికి తలొగ్గే ప్రసక్తే లేదు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్టు ఖండిస్తున్నా. శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్టు చేసి కేసులు బనాయించడం దుర్మార్గమైన చర్య. ఇప్పటికే కౌశిక్‌రెడ్డిపై ఎన్నో తప్పుడు కేసులు బనాయించారు. వాటిని తక్షణమే ఉపసంహరించుకోవాలి. అక్కడ ఎవరు ఏమిటో ఆ గ్రామ ప్రజానీకానికి, మండలానికి బాగా తెలుసు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని, దుర్మార్గాలను అడుగడుగునా ప్రశ్నిస్తున్నందుకే బీఆర్‌ఎస్ నేతలపై కక్ష సాధింపుగా అక్రమ కేసులు బనాయిస్తున్నారు. మాకు న్యాయస్థానాలపై విశ్వాసం ఉంది. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, తప్పుడు కేసులు పెట్టినా ప్రజల కోసం, ప్రజల పక్షాన పోరాటం ఎప్పటికీ ఆగదు. *– జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి*

# సార్ చూపిన బాటలో పయనిస్తాం

- స్వరాష్ట్ర సాధనోద్యమానికి దిక్సూచీ జయశంకర్
- తెలంగాణ జాతిని జాగృతం చేసిన మహనీయుడు
- బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం


పార్టీ కార్యాలయంలో జయశంకర్ సార్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న దాస్యం


నివాళులర్పిస్తున్న బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

హనుమకొండ, జూన్ 21 : 'స్వరాష్ట్ర సాధనోద్యమానికి దిక్సూచీ.. తెలంగాణ ప్రయోజనాలే లక్ష్యంగా పోరాడిన యోధుడు.. జాతిని జాగృతం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్' అని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. జయశంకర్ సార్ 14వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ సర్ స్మృతి వనం (ఏకశిలా పార్కు)లోని జయశంకర్ సర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ సర్ చూపిన బాటలో పయనిస్తామన్నారు. తెలంగాణే శ్వాస, ధ్యాసగా జీవించిన మహనీయుడు జయశంకర్ సార్ అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ఉద్యమ నేత కేసీఆర్‌కు స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో అండగా నిలిచిన వ్యక్తి అని కొనియాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏకశిలా పార్కును ప్రొఫెసర్ జయశంకర్ స్మృతి వనంగా మార్చినట్లు దాస్యం పేర్కొన్నారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, ముద్దసాని సహోదర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ గణేశ్, వీరేందర్, నయీముద్దీన్, బొందు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### పార్కు ఆక్రమణకు గురికాకుండా చూడాలి

*– శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్*

హనుమకొండ చౌరస్తా : ఏకశిలా పార్కు ఆక్రమణకు గురికాకుండా చూడాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 14వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం ఏకశిలా పార్కులోని ఆయన విగ్రహానికి బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక వాకర్ అసోసియేషన్ సభ్యులు పార్కులో నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. పార్కులో ఉత్తరం వైపు ఉన్న ఖాళీ స్థలంలో గ్రంథాలయం కోసం హామీ ఇచ్చారని, దానిని ఏర్పాటు చేయని క్రమంలో ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉందని, తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్కులో గ్రీనరీ బాగుందని, పూల మొక్కలు కూడా నాటాలని ఈ సందర్భంగా కమిషనర్‌కు బండా ప్రకాశ్ సూచించారు.

### ఒకే బైక్.. 233 చలాన్లు రూ. 45,350 పెండింగ్

సుబేదారి, జూన్21 : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి చలాన్లు కట్టకుండా తప్పించుకు తిరుగుతున్న ఓ ద్విచక్ర వాహనదారుడిని కా జీపేట ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. శనివారం కాజీపేట చౌరస్తాలో వాహనాలు తని ఖీ చేస్తుండగా హనుమకొండకు చెందిన అస్లం అనే వ్యక్తి పట్టుబడ్డాడు. అతడి బైక్‌పై ఏకంగా 233 ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉండగా, మొత్తం రూ. 45,350 చెల్లించాల్సి ఉన్నట్లు గుర్తించారు. దీంతో చలాన్లు మొత్తం చెల్లించేందుకు అతడి బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు.


అస్లం బైక్‌పై ఉన్న పెండింగ్ చలాన్లను చూపిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

### పత్తి రైతుకు అంతర్జాతీయ గుర్తింపు రావాలి

- టర్కీ ఇంపాక్ట్ ప్యానల్ శిక్షణలో 'ప్రజ్వల్' డైరెక్టర్ రజిత


శిక్షణలో పాల్గొన్న రజిత

శాయంపేట, జూన్ 21: హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాకకు చెందిన ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ ఎడ్ల రజిత రెండు రోజుల పాటు టర్కీ దేశంలో పర్యటించారు. అక్కడ ఇంపాక్ట్ ప్యానల్ శిక్షణ కార్యక్రమంలో తెలంగాణ నుంచి హాజరయ్యారు. వివిధ దేశాల ప్రతినిధులతో ఆమె మాట్లాడుతూ బీసీఐ నియమాలకు అనుగుణంగా పత్తి పండిస్తున్న రైతులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావాలన్నారు. శాయంపేట, గీసుకొండ, రేగొండ, పర్వతగిరి మండలాల్లోని 15,653 మంది రైతులకు అన్ని విధాలా తోడ్పాటునందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు అతి తక్కువ ధరలో వరంగల్ సూపర్ గోల్డ్, వరంగల్ గోల్డ్‌ను అందిస్తున్నట్లు చెప్పారు. రైతుల్లో నూతన వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తూ, పంటలో వివిధ రకాల జీవవైవిధ్యాలను ప్రదర్శిస్తూ, నాణ్యమైన పత్తి దిగుబడులు సాధిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బీసీఐ, వివిధ దేశాల వ్యవసాయ ప్రాజెక్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.


ములుగురూరల్: యోగా చేస్తున్న కలెక్టర్ టీఎస్ దివాకర, అధికారులు


కమలాపూర్: ఎంజేపీ బాలుర విద్యాలయంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా కార్యక్రమాలు
- పాల్గొన్న కలెక్టర్లు, సీపీ, నాయకులు, ప్రముఖులు


జనగామ చౌరస్తా: యోగాసనంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గోవిందరావుపేట: పస్రా హైస్కూల్‌లో యోగా అక్షర క్రమంలో విద్యార్థులు

# యోగా.. ఉత్సాహంగా

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో కలెక్టర్లు, పోలీస్, అధికారులు, నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు. ర్యాలీలు నిర్వహించి, ఆసనాలు వేసి ప్రజల్లో ఉత్సాహం నింపారు. యోగ కేవలం వ్యాయామమే కాకుండా మన ప్రాచీన ధ్యాన సంప్రదాయానికి నిదర్శమని కొనియాడారు. *– నమస్తే నెట్‌వర్క్*


ఖిలావరంగల్: కోటలో యోగా చేస్తున్న కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అధికారులు


సుబేదారి: యోగా చేస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్